
సాక్షి గుంటూరు

శనివారం । 20 । మే । 2023



వేసవి విజ్ఞాన శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం జరిగింది. శుక్రవారం విద్యార్థులకు ఆంగ్ల భాషపై అవగాహన కల్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 521.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి విడుదలవుతున్న నీటిని పూర్తిగా నిలిపివేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,800, గరిష్ట ధర రూ.3,200, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.

న్యూస్‌రీల్

పల్నాడుకు ఇద్దరు ఏఎస్పీలు



ఆర్.రాఘువేంద్ర, ఏఎస్పీ

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం పల్నాడు జిల్లాకు ఇద్దరు అదనపు ఎస్పీలును నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీలకు ఇటీవలే జిల్లా అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించింది. వారితో పాటు ఇప్పటికే పనిచేస్తున్న పలువురు అదనపు ఎస్పీలకు శుక్రవారం వివిధ ప్రదేశాల్లో కొత్త నియామకాలు ఇస్తూ రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులను జారీ చేసింది. ఆర్.రాఘువేంద్రను పల్నాడు జిల్లా ఏఎస్పీ (అడ్మిన్)గా నియమిస్తూ ఆదేశాలిచ్చింది. 2011 ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన ఆర్.రాఘువేంద్ర రాయలసీమ ప్రాంతంలో సుదీర్ఘకాలం పనిచేశారు. చివరగా కడప జిల్లా ఇంటిలిజెన్స్ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. రాఘువేంద్ర స్వగ్రామం అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గం కురుబురపల్లి. పదోన్నతిపై పల్నాడు జిల్లాకు వస్తున్నారు. అలాగే వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ ఎస్కే చంద్రశేఖర్‌ను పల్నాడుజిల్లా ఏఎస్పీ(నేరవిభాగం)గా నియమిస్తూ హోంశాఖ ఉత్తర్వులిచ్చింది. వీరిద్దరూ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

గుంటూరు ఏఎస్పీ (ఎల్‌అండ్‌ఓ)గా శ్రీనివాసరావు

నగరంపాలెం(గుంటూరు): గుంటూరు జిల్లా ఏఎస్పీ (లా అండ్ ఆర్డర్)గా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. శుక్రవారం పలువురు ఏఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఏఎస్పీగా వెయింటింగ్‌లో ఉన్న ఆయన గుంటూరుకు బదిలీయ్యారు. ఇప్పటి వరకు ఏఎస్పీగా కొనసాగిన పి.అనీల్‌కుమార్‌ను ఏసీబీ కేంద్ర కార్యాలయానికి బదిలీ చేయగా, అటాచ్‌మెంట్‌పై అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏఎస్పీగా నియమించారు.

రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా ఈశ్వరరావు



నగరంపాలెం(గుంటూరు): రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా కె.ఈశ్వరరావు నియమితులయ్యారు. శుక్రవారం పలువురు అడిషనల్ ఎస్పీ (ఏఎస్పీ)లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీసింది. ప్రస్తుతం గవర్నర్ ఇన్ రాజ్‌భవన్ ఏడీసీగా విధులు నిర్వహిస్తున్న ఈశ్వరరావును గుంటూరుకు బదిలీ చేశారు. ఈయన 2010 బ్యాచ్ గ్రూప్–1 అధికారి. గతంలో ఏలూరులో అడ్మిన్ ఏఎస్పీగా, గుంటూరు అర్బన్ (ఎల్‌అండ్‌ఓ) ఏఎస్పీగా విధులు నిర్వర్తించారు.

సంగీత సద్గురువు అన్నమాచార్యుల జయంతి



పాత గుంటూరు:బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో సంగీత సద్గురువు తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. కార్యక్రమాలను టి.ఆదిత్య వాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభలో ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మాట్లాడుతూ గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో సంప్రదాయ సంగీతంతో పాటు అనేక సేవా కార్యక్రమాలను ప్రత్యేకంగా మహిళలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం అన్నమయ్య కీర్తనలతో నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ శ్రావ్యంగా సాగింది. కళాకారులు, అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్.వి. ఎస్.లక్ష్మీనారాయణ, ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య పాల్గొన్నారు.

ఆవు కడుపు నుంచి 40 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

మచిలీపట్నంటౌన్: కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ఆహారం తీసుకోకుండా, నీరు తాగకుండా అనారోగ్యం పాలైన ఓ ఆవుకు కృష్ణాజిల్లా బందరు మండల పశువైద్యాధికారి పి.దీపక్ శుక్రవారం శస్త్రచికిత్స చేశారు. ఆవు కడుపులో పేరుకుపోయిన 40 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను ఆయన తొలగించారు. చిలకలపూడికి చెందిన పుట్టి మురారి తన ఆవు పది రోజుల నుంచి ఆహారం తినకపోవటం, నీరు తాగకపోవటంతో పశువైద్యాధికారి దీపక్‌ను ఆశ్రయించారు. దీంతో ఆయన ఆవును పరిశీలించి శస్త్రచికిత్స చేసి వ్యర్థాలను తొలగించారు. వైద్యాధికారి దీపక్ మాట్లాడుతూ ప్రజలు ఆవుకు ఆహారం పెట్టేటప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు వినియోగించకుండా ఉండాలని సూచించారు.

వలంటీర్ల వ్యవస్థ ఓ విప్లవం

- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు ప్రదానం
- 10,066 మందికి రూ.10.4 కోట్లు అందజేత



వలంటీర్లకు అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

గుంటూరు వెస్ట్: పాలనలోనే సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు ఒక విప్లవమని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజల వద్దకు చేర్చే క్రమంలో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు రెండు కళ్ళుగా పనిచేస్తున్నాయన్నారు. నవరత్న సంక్షేమ పథకాలను పేదలకు పారదర్శకంగా అందించడంలో వలంటీర్లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. వరుసగా మూడో ఏడాది కూడా అవార్డులను అందజేయడం శుభపరిణామమన్నారు. జిల్లాలో సేవా వజ్రకు 35, సేవా రత్నకు 134, సేవా మిత్రకు 9,897 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. మొత్తం 10,066 మందికి రూ.10.40 కోట్లు నగదును అందజేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. శాసన సభ్యులు కిలారి వెంకట రోశయ్య, మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి మానస పుత్రికలుగా సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు ఆవిర్భవించాయన్నారు. విద్య లేక చాలా మంది గతంలో సంక్షేమ పథకాలు పొందలేని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు వలంటీర్లు ఇంటికే వచ్చి పథకాలను అందిస్తున్నారని వివరించారు. కరోనా కష్టకాలంలోనూ ప్రాణాలకు తెగించి వలంటీర్లు చేసిన సేవ అనన్యసామాన్యమన్నారు.

పురస్కారాల ప్రదానం అభినందనీయం

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఏటా వలంటీర్లకు పురస్కారాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం కలెక్టర్ శాసన సభ్యులు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, డెప్యూటీ మేయర్ షేక్ సజిల, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, దివ్యాంగులు, వృద్ధుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పఠాన్ ముంతాజ్, అధికారులు ఎంపికైన వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమం నిర్వహణ బాధ్యతను జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు నిర్వర్తించారు.

ఆత్మ సంతృప్తి ఉంది



నేను ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివా. సచివాలయ వ్యవస్థలో పనిచేయాలని ప్రవేశ పరీక్ష రాశాను. నాలుగు మార్కుల తేడాతో ఉద్యోగం రాలేదు. వెంటనే వలంటీర్‌గా చేరాను. నాలుగో యేడు నడుస్తుంది. నా పరిధిలోని 12 పెన్షన్‌లు ఉండేవి. ఇప్పుడు అవి 34కు చేరాయి. అర్హులైన పేదలకు పథకాలు అందించేందుకు నా వంతు కృషి చేశా. జీతం తక్కువైనా ఆత్మ సంతృప్తి ఉంది.

– వై.గోపాల కృష్ణ, సేవా వజ్ర అవార్డు గ్రహీత, గుంటూరు 1వ సచివాలయం

ఆనందంగా ఉంది



పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా అందించడంలో మా పాత్ర ఎంతో ఉంటుంది. ముఖ్యంగా ఒక్క పైసా కూడా తీసుకోకుండా పార్టీ, కులం అడగకుండా చేస్తున్న సేవలకు ప్రజలు ఎంతో మెచ్చుకుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజలకు ప్రభుత్వంపై ఎంతో నమ్మకముంది. పురస్కారం రావడం ఆనందంగా ఉంది.

– ఎం.ఏడుకొండలు, సేవా రత్న అవార్డు గ్రహీత, గుంటూరు 103వ సచివాలయం

వృద్ధులకు సేవ చేసే భాగ్యం



నా పరిధిలో సుమారు 70 ఇళ్ళు ఉన్నాయి. ఈ ప్రాంతమంతా స్లమ్. చాలా మంది వృద్ధులకు అందలేదు. వారికి పింఛన్‌లు, రేషన్ ఇప్పించడం గొప్ప సేవా కార్యక్రమంగా అనిపిస్తోంది. ముఖ్యంగా సచివాలయ సిబ్బంది పూర్తి సహకారం ఉంది. ముఖ్యమంత్రి ఈ అవార్డు ఇచ్చి నాకు ప్రోత్సాహమిచ్చారు.

– షేక్ నాగూర్‌బి, సేవా మిత్ర అవార్డు గ్రహీత, గుంటూరు 4వ సచివాలయం.

సీఎం పర్యటనపై సమీక్ష



సీఎం పర్యటనపై సమీక్షిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్ : సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు ఇస్తున్న ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్న నేపథ్యంలో శుక్రవారం ఎంటీఎంసీ కార్పొరేషన్ కార్యాలయంలో సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్‌తో సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. సమావేశం అనంతరం కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 26న పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేయాలని భావిస్తున్నారని, ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై చర్చించేందుకు సమావేశమయ్యామని వివరించారు. సమావేశంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజ్యలక్ష్మి, సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ అనిల్, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, తాడేపల్లి తహసీల్దార్ మల్లిరెడ్డి నాగిరెడ్డి, మంగళగిరి తహసీల్దార్ రామ్‌ప్రసాద్, మంగళగిరి నార్త్‌జోన్ డీఎస్పీ రాంబాబు, ఎంటీఎంసీ డీఈ కృష్ణారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు వ్యాఖ్యలపై నిరసన



అమరావతిలో పేదలకు ఇచ్చే ఇళ్లస్థలాలు సమాధులు కట్టుకోవడానికేనని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ప్రజలు భగ్గుమన్నారు. వైఎస్సార్ సీపీ, ఎమ్మెల్యే మద్దాళి గిరి, డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, సజిల ఆధ్వర్యంలో గుంటూరులో ప్రదర్శన నిర్వహించారు. – గుంటూరు

ఎనిమిది మంది తో దుర్గగుడి వైదిక కమిటీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి ఎనిమిది మందితో కూడిన వైదిక కమిటీని ఏర్పాటు చేస్తూ ఆలయ ఈవో భ్రమరాంబ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైదిక కమిటీలో స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వి.శ్యావశ్య మహర్షి, యూవీఎల్ఎస్ సుబ్రహ్మణ్య ఘనాపాటి, లింగంబోట్ల బద్రీనాథ్‌బాబు, బి. శంకర్ శాండిల్య, యజ్ఞనారాయణ శర్మ, అర్చకుడు యూవీఎస్ మురళీధర్ శాస్త్రి, పీవీ రఘునాథ శర్మలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

హెపటైటీస్‌కు వ్యాక్సినే సంజీవని

- ముందు జాగ్రత్తలతో కాలేయ వ్యాధులకు దూరం
- గుంటూరు జీజీహెచ్‌లో స్క్రీనింగ్ పరీక్షలు
- నెలకు రూ.20వేలు ఖరీదు చేసే మందులు ఉచితం
- హెపటైటీస్ అవగాహన మాసం 'మే'



హెపటైటిస్ నెల పోస్టర్

గుంటూరు మెడికల్: హెపటైటీస్ కాలేయానికి సంబంధించిన వ్యాధి. హెపటైటీస్ వైరస్ ద్వారా ఇది సోకుతుంది. ఈ వ్యాధిని కలుగచేసే వైరస్ శరీరంలోకి ఒకసారి వస్తే క్రమేపి వైరస్‌ల సంఖ్య లక్షల్లో పెరిగిపోయి లివర్‌ను దెబ్బతీస్తుంది. ఏ, బీ, సీ, డీ, ఈ రకాలు ఉన్నా వాటిలో బీ, సీ ప్రాణాంతకం.

ప్రతి ముగ్గురిలో ఒకరికి..

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రతి ముగ్గురిలో ఒకరు హెపటైటీస్ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా హెపటైటీస్–బీ, సీ వ్యాధులతో 354 మిలియన్ల మంది బాధపడుతున్నారు. సైలెంట్ కిల్లర్‌గా పిలువబడే ఈ వ్యాధులు సోకిన వారిలో 80శాతం మందికి వ్యాధిపై, వైద్య చికిత్సలపై అవగాహన లేదు. దీంతో ఏటా మేనెలను హెపటైటీస్ అవగాహన మాసంగా నిర్ణయించారు. విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక స్క్రీనింగ్ శిబిరాలు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హెపటైటీస్ లాంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి ప్రజలను రక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకంగా స్క్రీనింగ్ క్యాంపులను అన్ని ప్రభుత్వ టీచింగ్ ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో హెపటైటీస్ స్క్రీనింగ్ కార్యక్రమం 2020 నవంబరులో ప్రత్యేకంగా ప్రారంభించారు. ప్రతిరోగికి నెలకు సుమారు 20వేలు ఖరీదు చేసే మందులు జీజీహెచ్‌లో ఉచితంగా అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక్కో వైద్యుడి వద్ద వారంలో ముగ్గురేసి చొప్పున హెపటైటీస్ బాధితులు చికిత్స పొందుతున్నారు.

వ్యాధి సోకే విధానం...

ఇన్‌ఫెక్ట్ అయిన రోగి రక్తపు ఉత్పత్తుల ద్వారా, శరీరంలో ఊరే వివిధ ద్రవాల ద్వారా (వీర్యం, యోని స్రవాలు, మూత్రం) సురక్షితం కాని సంభోగం ద్వారా, అనేక మందితో సంభోగం చేయటం ద్వారా, ఒకరికి వాడిన సిరంజిలు వేరొకరికి వాడటం ద్వారా, టాటూలు వేసుకోవటం, ముక్కు, చెవులు కుట్టుకోవటం, ఒక రేజర్ బ్లేడ్‌ను అనేక మంది వాడటం, ఒకరు వాడిన టూత్ బ్రష్‌ను మరొకరు వాడటం, అసురక్షితమైన రక్తదానం ద్వారా, వైరల్ కలిగి ఉన్న గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు హెపటైటీస్–బీ, సీ వ్యాధులొస్తాయి. వ్యాధి సోకిన వారిలో తొలిదశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. దీనివల్లే ఎక్కువ మందికి ఇది సోకుతుందని అంచనా.

వ్యాధి లక్షణాలు

కాలేయం వాచిపోయి మూత్రం పసుపుపచ్చగా వస్తుంది. కళ్ళు, శరీరం, నాలుక తదితర భాగాలన్నీ పసుపు పచ్చగా మారిపోతాయి. దీనినే పచ్చకామెర్లు అంటారు. వ్యాధి ప్రారంభ దశలో తేలికపాటి జ్వరం, ఆకలి మందగించటం, రక్తపు వాంతులు, వ్యక్తి బాగా బలహీనపడటం, పొట్ట ఉబ్బరం, కాళ్ళకు వాపులు, కీళ్ళనొప్పులు ఉంటాయి.

2020 నుంచి ఇప్పటివరకు జీజీహెచ్‌లో చికిత్సలు ఇలా..

	హెపటైటీస్–బీ	హెపటైటీస్–సీ
స్క్రీనింగ్ టెస్ట్‌లు	13,538	7,074
వ్యాధి నిర్ధారణ	832	337
ప్రస్తుతం కేసులు	309	252

వ్యాక్సిన్ చేయించుకోవాలి



హెపటైటీస్ బీ వ్యాధి సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్ చేయించుకోవాలి. టీకాతో వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చు. హెపటైటీస్–సీ వ్యాధికి వ్యాక్సిన్ లేదు. కాని వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే వైద్యం చేసి నయం చేయవచ్చు.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్


ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలి





సాధారణంగా హెపటైటీస్‌లో 70 నుంచి 80 శాతం వరకు సమస్య పెరిగే వరకు వ్యాధి లక్షణాలు బయటపడవు. కాబట్టి హైరిస్క్ గ్రూప్‌కు చెందిన వారు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవటం చాలా ఉత్తమం. ఆధునిక వ్యాధి నిర్ధారణ పద్ధతులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. గతంలో పచ్చకామెర్లు, హెపటైటీస్ లక్షణాలు ఉన్నవారే కాకుండా అనుమానం ఉన్నవారూ వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవటం చాలా ఉత్తమం.

– డాక్టర్ బి.జాని, రేడియాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్

చారిత్రక వాస్తుశిల్ప 'చిత్ర' సంపద







వసీఫ్ తన కెమెరాలో బంధించిన చారిత్రక కట్టడాలు తాజ్‌మహల్, జామా మసీదు, ఎర్రకోట చిత్రాలు

- ఫొటో జర్నలిస్టు కేఎన్ వసీఫ్ దేశానికి ఇచ్చిన బహుమానం
- రేపు విజయవాడలో 'ఆర్కిటెక్చరల్ హెరిటేజ్' దృశ్యమాలిక పుస్తకావిష్కరణ

తెనాలి: ఆయనో ఫొటో జర్నలిస్టు.. ఉండేది ఎడారి దేశంలోనైనా ఏడాదికోసారి మేరా భారత్ మహాన్ అనుకుంటారు. రెక్కలు కట్టుకుని వాలతారు. కెమెరా క్లిక్ చేసే ప్రతిసారీ ఓ చారిత్రక కట్టడంకేసి తొంగిచూస్తారు. విశిష్టతను శోధిస్తారు. ఆ తర్వాతే దృశ్యం కెమెరా కందుతుంది. తన మనోనేత్రం గుర్తించిన అద్భుతాన్ని హృద్యంగా కెమెరా రెటీనా కందిస్తారు.. మెరిపిస్తారు. ఆయనే కేఎన్ వసీఫ్.

కాఫీ టేబుల్ బుక్ రూపకల్పన

భారతదేశంలోని అద్భుతమైన ఆర్కిటెక్చరల్ హెరిటేజ్‌ను దాదాపు పదేళ్లకుపైగా తన కెమెరాతో క్లిక్ మనిపిస్తున్న వసీఫ్ దాదాపు 35 వాస్తు కట్టడాలకు సంబంధించిన 150 ఫొటోలతో అద్భుతమైన కాఫీ టేబుల్ బుక్‌ను రూపొందించారు. భారతీయ ఆత్మ అనదగ్గ ఫొటోలతో కూడిన ఈ పుస్తకాన్ని మనదేశంలో తొలిసారిగా ఈనెల 21న విజయవాడ నగరంలో ఆవిష్కరించనున్నారు. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా (పీఏఐ) ఆధ్వర్యంలో బెజవాడ ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఉదయం 11 గంటలకు ఏర్పాటయే సభలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఈదర శ్రీనివాసరెడ్డి ఆవిష్కరిస్తారు. ఐఏఎస్ అధికారి, ఏపీ స్టేట్ మైనార్టీస్ వెల్ఫేర్ డైరెక్టర్ ఎ.ఎండీ ఇంతియాజ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పీఏఐ వ్యవస్థాపక చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఎన్నో కట్టడాలకు పుస్తకంలో చోటు

వైవిధ్యం, గొప్ప వారసత్వం, అద్భుతమైన గతం భారతదేశం ప్రత్యేకత. మధ్యయుగం మొఘల్ పాలకుల నుంచి బ్రిటిష్ రాచరికపు వ్యవస్థ వరకు దేశంలో నిర్మాణమైన కోటలు, స్మారక కట్టడాలు, రాజభవనాలు దేశ వారసత్వ సంపదకు ప్రతీకలని తెలిసిందే. ఢిల్లీ ఎర్రకోట, ఆగ్రాలోని తాజ్‌మహల్, కుతుబ్ మినార్, హుమాయున్ సమాధి, అజంతా, ఎల్లోరా నిర్మాణాల నుంచి హైదరాబాద్‌లోని చార్మినార్ వరకు వేటికవే ప్రత్యేకమైన కట్టడాలు. నిర్మాణ శైలి, వినియోగించిన శిలలు, రాళ్లు.. అన్ని విభిన్నమైనవే. రాజా దీనదయాళ్ తీసిన ఫొటోల్లో నాలుగొందల ఏళ్లకు పైబడిన భాగ్యనగరంలోని చారిత్రక స్థలాల్ని, నిజాం నవాబుల జీవితాన్నీ ఇప్పటికీ చూడగలుగుతున్నాం. ఆ తరహాలోనే భారతదేశ అద్భుత ఆర్కిటెక్చరల్ హెరిటేజ్‌కు ప్రతిరూపాలనదగ్గ చిత్రరాజాలను ఇప్పుడు వసీఫ్ మనముందుకు తీసుకొస్తున్నారు.

వసీఫ్ నేపథ్యం ఇదీ..



కేఎన్ వసీఫ్ స్వస్థలం హైదరాబాద్. ప్రస్తుతం సౌదీఅరేబియాలోని రియాద్‌లో ఉంటున్నారు. అక్కడి ఆర్కిటెక్చరల్ మేగజైన్ 'ఆల్బెనా'తో రెండు దశాబ్దాల అనుబంధం. రియాద్‌కు వెళ్లే ముందు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌గా దశాబ్దంపాటు పనిచేశారు. ఫొటో జర్నలిస్టుగా 'సియాసత్' ఉర్దూ డైలీలో చేశారు. తర్వాత డెక్కన్ క్రానికల్, ఇలస్ట్రేటెడ్ వీక్లీ, ఇండియా టుడే, సావీ, సొసైటీ, ఆన్‌లుకర్ వంటి పత్రికలకు పనిచేశారు. వసీఫ్ కృషిని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ, ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ సొసైటీ, ఏపీ ఫొటోగ్రాఫిక్ అకాడమీలు గుర్తించాయి. 1998 నుంచి ఏటా ఒక నెలరోజులు భారతదేశం వస్తూ ఇక్కడ ఫొటో షూట్‌లను షెడ్యూల్ చేస్తున్నారు. భారతీయ ఆర్కిటెక్చర్‌లోని వివిధ శైలులను డాక్యుమెంట్ చేస్తున్నారు. 2005లో తొలిసారిగా జెద్దాలోని ఇండియన్ కాన్సులేట్‌లో జరిగిన భారతీయ ఉత్సవంలో భారతదేశ వారసత్వ ఫొటోలను ఎగ్జిబిట్ చేసే అవకాశాన్ని అక్కడి కాన్సులేట్ ఔసార్ సయీద్ కల్పించినట్టు వసీఫ్ చెప్పారు. అప్పటి నుంచి సౌదీ అరేబియాలోని వివిధ నగరాల్లో, రియాద్, జెద్దా కాన్సులేట్‌తో కలిసి ఫొటో ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆవిధంగా గల్ఫ్ దేశాల్లోని లక్షలాది భారతీయుల్లో దేశీయ పర్యాటకంపై ఆసక్తిని రేకెత్తిస్తున్నారు. భారతీయ చారిత్రక కట్టడాలపై పలు లఘు చిత్రాలనూ తీశారాయన.

మృత్యువులోనూ వీడని బంధం

- ఒకేరోజు తనువు చాలించిన సీఎస్సార్ మాస్టారు దంపతులు
- గురువుకు నివాళులర్పించిన రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



సుబ్రహ్మణ్యేశ్వరరావు, పుష్ప లీలావతి (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: అరవై ఏళ్ల వైవాహిక జీవితంలో ఎప్పుడు ఎడబాటు అనేది లేదు. ఒకరిని విడిచి, ఒకరు ఉండలేని బంధం వారిది. అందుకే ఎనిమిది పదుల వయసులో భర్త మరణాన్ని భరించలేని ఆ ఇల్లాలు పతి అంత్యక్రియలు పూర్తయిన కొద్దిసేపటికే తనూ తనువు చాలించింది. ఈ హృదయవిదారక ఘటన గురువారం గుంటూరులో జరిగింది. గుంటూరు నగరంలోని చౌత్రా సెంటర్లో నివసిస్తున్న చుండూరు సుబ్రహ్మణ్యేశ్వరరావు సంగడిగుంటలోని జీసీఎస్ఎస్ జూనియర్ కాలేజీ హైస్కూల్ (చలమయ్య హైస్కూల్)లో 1966 నుంచి గణిత శాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేసి 1993లో ఉద్యోగ విరమణ చేశారు సీఎస్సార్ మాస్టారుగా సుపరిచితులైన ఆయన బోధనా పటిమతో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయన వద్ద చదువుకున్నవారు వివిధ రంగాల్లో ఉన్నతస్థాయిల్లో స్థిరపడ్డారు. 88 ఏళ్ల వయసులో అనారోగ్యంతో ఈనెల 18న ఉదయం గుంటూరులోని తన స్వగృహంలో ఆయన తుది శ్వాస విడిచారు. భర్త అంత్యక్రియలు పూర్తి చేసిన కొద్ది సేపటికే ఆయన సతీమణి పుష్పలీలావతి (83) మానసిక వేదనతో తనువు చాలించారు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సుబ్రహ్మణ్యేశ్వరరావు మాస్టారు వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థి, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి గురువారం గురువు, శుక్రవారం ఉదయం గురుపత్నీ పుష్పలీలావతి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తమ గురువు సుబ్రహ్మణ్యేశ్వరరావు వద్ద చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు.

క్లుప్తంగా

రైతుల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శివరామకృష్ణయ్య



గుంటూరు వెస్ట్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమోతు శివరామ కృష్ణయ్య తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట కాలువల శుభ్రం చేయడానికి సంబంధించి రూ.5 లక్షల లోపు పనులను రైతు సంఘాలకు కేటాయించడం హర్షణీయమన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1700 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కావాల్సిన వారు గ్రామ, వార్డు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. 400 ప్యాకెట్ల మిరప విత్తనాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచామని చెప్పారు. మార్క్‌ఫెడ్ ద్వారా శనగలను 504 మంది రైతుల నుంచి 1748 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. కాలువలు శుభ్రం చేసే పనులను రూ. 5 లక్షలు దాటిన పనులను టెండర్ల ద్వారా అప్పగించనున్నట్లు వివరించారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ జీఎం కృష్ణారావు, ఉద్యాన శాఖాధికారి సుజాత పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులకు ఖాళీలను ప్రదర్శించాలి



సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళాధర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ ఖాళీలను ప్రదర్శించి, మాన్యువల్ విధానంలో నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ కోరారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లస్ టూ పాఠశాలల కోసం పీజీటీ పోస్టులు, ఎంఈఓ-2 పోస్టులతో పాటు వందలాది స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేస్తున్న దృష్ట్యా ప్లేసులతో సహా కౌన్సెలింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. మాన్యువల్ విధానంలో ఖాళీలను చూపించి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతులు తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఎం.గోవిందయ్య, ఎం. గురుబ్రహ్మం, ఎం.కోటిరెడ్డి పాల్గొన్నారు.

చదివేది డిగ్రీ.. చేసేది బైక్ చోరీలు

- ద్విచక్ర వాహనం చోరీ కేసులో విద్యార్థి అరెస్ట్
- 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



చోరీ కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ అశోక్ కుమార్, సిబ్బంది


నరసరావుపేట టౌన్: డిగ్రీ చదువుతూ చెడు వ్యసనాలకు బానిసై ద్విచక్ర వాహన దొంగతనాలకు పాల్పడుతున్న విద్యార్థిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేట మద్దినగర్‌కు చెందిన షేక్ ఖాలీషా నరసరావుపేట పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ ఆ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. రెండు నెలల క్రితం అతని స్నేహితుడి వద్ద కారు తీసుకొని ఖాలీషా శావల్యాపురం తిరునాళ్లకు వెళ్లి తిరిగి వస్తుండగా యాక్సిడెంట్ అయింది. కారు రిపేరు చేసేందుకు రూ.50 వేలు ఖర్చు అవుతుందని వాటిని ఇవ్వాలని యజమాని ఒత్తిడి తెస్తున్నాడు. డబ్బు కోసం ఖాలీషా ద్విచక్రవాహనాల దొంగతనాల మార్గం ఎంచుకున్నాడు. ప్రతిరోజు రాత్రిళ్లు పట్టణంలో సంచరిస్తూ ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్నాడు. రామిరెడ్డిపేట రాధాసుందర కల్యాణ మండపం, సన్నిధి ఫంక్షన్ హాల్ వద్ద నిలిపి ఉన్న 8 ద్విచక్రవాహనాలను దొంగిలించి రైల్వే స్టేషన్ వెనుక భాగంలో ముళ్ల పొదల్లో వాటిని దాచాడు. దొంగిలించిన వాహనాల్లో ఒక వాహనంపై సంచరిస్తూ శుక్రవారం ఆర్‌యూబీ వద్ద తనిఖీలు చేస్తున్న సమయంలో పట్టుబడ్డాడు. విచారణలో పై నేరాలన్నీ తానే చేశానని నేరాన్ని అంగీకరించటంతో ద్విచక్రవాహనాలను అతడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ఎన్.వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

కీర్తి ఆకాసుమంత

- రాజనీతిజ్ఞుడు మాజీ సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి
- జాతీయస్థాయిలో చెరగని ముద్ర వేసిన ఉద్దండులు
- ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా కీలక నిర్ణయాలు
- 92 బీసీ కులాలకు రిజర్వేషన్లు అమలు చేసిన సాహసి
- పదుల సంఖ్యలో కేంద్ర సంస్థలను హైదరాబాద్‌కు తెచ్చిన ఘనులు
- నాగార్జునసాగర్ నిర్మాణం, సికింద్రాబాద్‌లో రైల్వే జోన్ ఏర్పాటు ఆయన హయాంలోనే..
- పేదలకు పక్కా గృహాలివ్వాలని తొలిగా ఆలోచించిన యోధుడు
- నేడు కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతి
- బీసీ డేగా ప్రకటించిన బీసీ సంఘాలు

తనువు చాలించి మూడు దశాబ్దాలైనా చెరగని కీర్తి ఆయన సొంతం. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగిన కాకలు తీరిన యోధుడు. ఉమ్మడి గుంటూరు జిల్లా ముద్దుబిడ్డ కాసు బ్రహ్మానందరెడ్డి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా ఆయన అందించిన సేవలు అజరామరం. మహారాష్ట్ర గవర్నర్, ఏఐసీసీ అధ్యక్షుడిగా ఆయన ఆ పదవులకే వన్నె తెచ్చారు.

– సాక్షి, నరసరావుపేట



అప్పటి ప్రధాని ఇందిరాగాంధీతో కలసి నాగార్జున సాగర్ డ్యాంను పరిశీలించిన మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి (ఫైల్ ఫొటో)

స్వాతంత్య్ర సమరంలో...

ఉమ్మడి గుంటూరు జిల్లా నాదెండ్ల మండలంలోని చిరుమామిళ్లలో వెంకటకృష్ణారెడ్డి, శాయమ్మ దంపతులకు 1909 జూలై 28న కాసు బ్రహ్మానందరెడ్డి జన్మించారు. తిరువనంతపురం వర్సిటీలో న్యాయశాస్త్ర పట్టభద్రుడయ్యారు. న్యాయవాద వృత్తి చేపట్టి అచిర కాలంలోనే పేరు ప్రఖ్యాతులు సాధించారు. 1936లో రాజకీయ ప్రవేశం చేశారు. జిల్లా బోర్డుకు జరిగిన ఎన్నికల్లో జస్టిస్ పార్టీ తరఫున పోటీచేసి విజయం సాధించారు. స్వాతంత్రోద్యమంలో చురుగ్గా పనిచేశారు. పలుమార్లు అరెస్టయ్యారు. లాఠీ దెబ్బలు తిన్నారు.



మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి

మహాత్మా గాంధీని స్వయంగా కలుసుకున్నాక ఆయన స్ఫూర్తితో ఖద్దరు వస్త్రధారణ చేపట్టారు. సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారు. జైలుకెళ్లారు. ఆంధ్రరాష్ట్రంలో నీలం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన తొలి క్యాబినెట్‌లో ఆర్థికశాఖ మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా 1964 ఫిబ్రవరి 21న ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రాన్ని బహుముఖ రంగాల్లో ప్రగతి బాట పట్టించారు. సొంత ప్రాంతం గుంటూరు, జిల్లా, పల్నాడు ప్రాంతం, నరసరావు పేట అభివృద్ధికి విశేష కృషి చేశారు. నరసరావుపేటలో విద్యాభివృద్ధికి ఎడ్యుకేషనల్ సొసైటీ స్థాపించారు.

సీఎంగా కీలక నిర్ణయాలు...

బాలికా విద్యకు అగ్ర ప్రాధాన్యమిచ్చారు. వారికి సెకండరీ స్థాయి వరకూ ఉచిత విద్య అందించారు. బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటుచేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేశారు. జిల్లా పరిషత్‌లకు సంపూర్ణ అధికారాలిచ్చారు. ఆ రోజుల్లో రూ.10 కోట్ల ఎల్ఐసీ రుణంతో బలహీన వర్గాలకు తొలిసారి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. స్వయానా క్రీడాకారుడైన ఆయన సీఎంగా క్రీడలకు ప్రాధాన్యమిచ్చారు. హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియం ఆయన హయాంలోనే నిర్మాణమైంది. బీహెచ్ఈఎల్, ఐడీపీఎల్, ఈసీఐఎల్, బీడీఎల్, హిందుస్థాన్ కేబుల్స్ వంటి పదుల సంఖ్యలో కేంద్రసంస్థలను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. వేలాది మందికి ఉపాధిని కల్పించారు. విశాఖ ఉక్కు కర్మాగారం తదితర దిగ్గజ సంస్థల ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించి రాష్ట్రం పారిశ్రామికంగా సుసంపన్నం కావడానికి దోహదపడ్డారు. సికింద్రాబాద్ కేంద్రంగా సౌత్‌సెంట్రల్ రైల్వే జోన్ నిర్మాణంలో కాసు కృషి ఎంతో ఉంది. బహుళార్థ సాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్ నిర్మాణం ఆయన హయాంలోనే పూర్తయింది.

ఏఐసీసీ అధ్యక్షుడిగా...

బ్రహ్మానందరెడ్డి 1964 మొదలుకొని 1971 వరకూ ఏడేళ్లపాటు సీఎంగా పని చేశారు. తెలంగాణ ఉద్యమ తీవ్రత వల్ల పదవి నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత ఆరో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా, కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఎమర్జెన్సీ ఎత్తివేశాక 1977లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఇందిరాగాంధీ రాజీనామా చేసినప్పుడు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షుడయ్యారు. ఆ మరుసటి ఏడాది ఇందిరాగాంధీతో విభేదాలు తలెత్తడంతో ఇందిరా కాంగ్రెస్ పేరుతో ఆమె వేరు కుంపటి పెట్టుకున్నారు. అయితే 1980లో తన నాయకత్వంలోని కాంగ్రెస్‌ను ఆయన ఇందిరా కాంగ్రెస్‌లో విలీనం చేశారు. రాజీవ్‌గాంధీ హయాంలో మహారాష్ట్ర గవర్నర్‌గా పని చేశారు. 1994 మే 20న కన్ను మూసిన బ్రహ్మానందరెడ్డి చివరివరకూ విలువలకు కట్టుబడి జీవించారు.

బీసీ ప్రత్యేక రిజర్వేషన్లు కాసు పుణ్యమే

బీసీ కులాలకు ప్రత్యేక రిజర్వేషన్లు కాసు బ్రహ్మానందరెడ్డి పుణ్యమే. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా 1970లో 92 బీసీ కులాలకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అందుకే ఆయనను బీసీలు ఈనాటికీ మరిచిపోలేదు. నేడు అయన వర్ధంతిని బీసీడేగా ఘనంగా నిర్వహించేందుకు బీసీ సంఘాలు సిద్ధమయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- పెళ్లి రోజు విషాదం
- బైక్‌ను వెనక నుంచి ఢీకొట్టిన లారీ



జోసఫ్‌కుమార్ (ఫైల్)

మేడికొండూరు: పెళ్లిరోజు విషాదం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులతో షాపింగ్ చేసేందుకు గుంటూరు వెళ్లారు. బైక్‌పై వస్తుండగా లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పేరేచర్ల గుంటూరు బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. ఫిరంగిపురం గ్రామానికి చెందిన పోలంకి బాలశౌరి జోసఫ్ కుమార్(32) గుంటూరులో ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఫిరంగిపురం నుంచి ద్విచక్ర వాహనంపై గుంటూరు వచ్చి పని ముగించుకుని తిరిగి వెళ్తుంటాడు. పెళ్లిరోజు కావడంతో భార్య బి.రోజాను ద్విచక్ర వాహనంపై షాపింగ్ చేసేందుకు గుంటూరు తీసుకెళ్లాడు. షాపింగ్ ముగిసిన అనంతరం భార్యను బస్సు ఎక్కించాడు. తన పనులు ముగించుకుని రాత్రి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యంలో పేరేచర్ల గుంటూరు బ్రిడ్జి సమీపంలో వెనుకగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే జోసఫ్‌కుమార్ మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఏడు నెలల బాబు ఉన్నాడు.

ఆలయ పునఃనిర్మాణానికి సహకరించాలని వినతి

యద్దనపూడి: ఆలయం పునఃనిర్మాణానికి సహకరించాలని కోరుతూ శుక్రవారం ఆలయ డెవలప్‌మెంట్ సమితి సభ్యులు, గ్రామస్తులు జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ పానకాల రావుకు వినతిపత్రం అందించారు. మండలంలోని పోలూరు గ్రామంలో ఉన్న గంగాభ్రమరాంబ సమేత చెన్నుమల్లికార్జునస్వామి సుమారు 250 ఏళ్ల కిందట నిర్మించారు. ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరి ఆలయం మొత్తం పల్లంగా ఉండటంతో వర్షపునీరు, మురుగునీరు గర్భాలయంలోకి చేరి స్వామివారి మూలవిరాట్‌లు సైతం మునిగిపోతుండటంతో నూతన ఆలయం నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సుమారు రూ.2 కోట్లతో ఆలయ పునఃనిర్మాణం చేయాలని భావించి ఈ విషయాన్ని గ్రామస్తులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లటంతో ఏసీ పానకాలరావు ఆలయాన్ని సందర్శించి ఆలయ పరిసరాలను పరిశీలించారు. గ్రామస్తులు మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ కింద రూ.30 లక్షల చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, దేవదాయశాఖ తరఫున గ్రాంటు మంజూరు చేయాలని కోరారు. ఏసీ పానకాలరావు ఆలయ పునఃనిర్మాణానికి శాఖాపరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర, ఈఓ జ్యోతి, అర్చకులు నూతలపాటి లలిత్‌ప్రసాద్, మల్లికార్జునశర్మ, దుర్గానాగేంద్రబాబు పాల్గొన్నారు.

నారెడ్కో జిల్లా నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీతో ప్రమాణం చేయిస్తున్న శ్రీనివాస్ కుమార్

పాత గుంటూరు: గుంటూరులోని హోటల్‌లో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నారెడ్కో) క్యాపిటల్ జోన్ రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి చుక్కపల్లి రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా నారెడ్కో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా పెరవలి నాగ వంశీ, ఉపాధ్యక్షులుగా టి. యోగేశ్వర రావు, శ్రీనివాస్ మహంతి, కార్యదర్శిగా విష్ణు మొలకల శ్రీనాథ్, సంయుక్త కార్యదర్శులుగా వీరభద్రుని వెంకట రెడ్డి, బెల్లంకొండ సదాశివ గౌడ్, కోశాధికారిగా టి.అర్జున్ సాయి, సభ్యులుగా కల్లూరి చిన తిరుపతయ్య, దగ్గుపాటి కిషోర్, కాలిశెట్టి వంశీకృష్ణ, ఎర్రగడ్డ బుచ్చిబాబు, యాగంటి అవినాష్, దొడ్డ సురేందర్ కుమార్, పెరవలి సుధాకర్, ఎస్వీ శివరామ్ ప్రసాద్, మేనేజర్ రావూరి అశోక్ ఎన్నికయ్యారు. నాయుడు శ్రీనివాస్‌కుమార్ ఎన్నికను నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరి మృతి

సత్తెనపల్లి: ఎదుట లారీని తప్పించే క్రమంలో డివైడర్‌ను లారీ ఢీ కొట్టిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాల ఎదుట శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. మొక్కజొన్న లోడుతో గుంటూరు నుంచి రాజస్థాన్ వెళ్తున్న లారీ పట్టణంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాల ఎదుట ఎదురు వస్తున్న లారీని తప్పించే క్రమంలో ప్రహరీని బలంగా ఢీకొంది. ఈ ఘటనలో క్లీనర్‌గా పని చేస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నిమ్ముచి జిల్లాకు చెందిన దామి రాకేష్(28) అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఘటనా స్థలాన్ని పట్టణ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.


జాతీయ రహదారిపై..

పిట్టలవానిపాలెం: అతివేగం ఒకరి ప్రాణాలు తీయగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పిట్టలవానిపాలెం మండలం చందోలు జాతీయ రహదారిపై అధిక వేగంతో ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు ప్రయాణిస్తున్నారు. చందోలు శివారులోని జాతీయ రహదారి పక్కనే నూతనంగా నిర్మిస్తున్న బస్టాప్‌ను వేగంగా ఢీకొన్నారు. వీరిలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు యువకులకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. వీరందరిది చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం గ్రామంగా చెబుతున్నారు. మృతుడు పగడాల ఇంద్రకరణ్ రెడ్డిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. చందోలు ఏఎస్ఐ దాసు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
శనివారం ॥ 20-5-2023

నెమలీకల టోపీ ధరించి కోలాహలంగా ఆడతారు.
రేలా... రే... రేలా అంటూ గొంతు కలిపి పాడతారు.
ప్రకృతి గురువు నేర్పిన పాఠాలకు ఆనవాళ్లు వారు.
మొన్నటి వరకు అడవి తల్లి ఒడిలో దాగిన కళారూపాలివన్నీ.
నేడవి అడవి గోడలు దాటి నగరాన్ని ఉర్రూతలూగిస్తున్నాయి.
దేశం ఎల్లలు కూడా దాటే వరకు గుస్సాడి ఆడాలంటున్నారు...
పద్మశ్రీ కనకరాజు.





గుస్సాడి గుండెచప్పుడు

పద్మశ్రీ కనకరాజు

కనకరాజు పేరులో ఇంటి పేరు కనక, ఆయన పేరు రాజు. ఇన్ని వివరాలు మాకక్కర్లేదు, గుస్సాడి నృత్యం చేస్తాడు, మా అందరి చేత అడుగు వేయిస్తాడు కాబట్టి ఆయన మాకు 'గుస్సాడి రాజు' అంటారు స్థానికులు. ఆయన పద్మశ్రీ అందుకున్నప్పటి నుంచి నాగరక ప్రపంచం ఆయన మీద దృష్టి కేంద్రీకరించింది. కనక రాజు అని ఇంటిపేరుతో కలిసి వ్యవహారంలోకి వచ్చారు. అయినప్పటికీ వారి గూడేలకు వెళ్లి కనకరాజు అని అడిగితే వెంటనే గుర్తుపట్టరు. గుస్సాడి కనకరాజు అంటే టక్కున చెప్పేస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మర్లవాయి ఆయన ఊరు. ప్రస్తుతం కుమ్రుం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, అంతేకాదు, కుమ్రుం భీమ్ వారసులు కూడా. ఆదిలాబాద్‌లో విస్తరించిన గోండ్ తెగకు చెందిన వాళ్లందరూ భీమ్ వారసులుగా గర్వంగా భావిస్తారు. ఎనభై ఏళ్ల కనకరాజు... తండ్రి చెప్పిన మాట కోసం గుస్సాడి నృత్యం పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేశారు. గుస్సాడితో మమేకమైన తన జీవితానుభవాలను సాక్షితో పంచుకున్నారాయన.

ఆట... పాట... జీవితం!

"మా ఆదివాసీల జీవనంలో ప్రకృతి, నృత్యం, గానం కలగలిసి పోయి ఉంటాయి. బిడ్డ పుడితే పాట, పెళ్లి వేడుకకీ పాట, అంతే కాదు... మనిషి పోయినా పాట రూపంలో ఆ వ్యక్తితో మా అనుబంధాన్ని గుర్తు చేసుకుంటాం. దండారీ ఉత్సవాలంటే మాకు ఎక్కడ లేని ఉత్సాహం వచ్చేస్తుంది. మగపిల్లలకు నృత్యం, ఆడపిల్లలకు రేలా పాట చిన్నప్పటి నుంచే నేర్పిస్తాం. గుస్సాడి నృత్యంలో అడుగులు వేయడం ఎప్పుడు మొదలైందో నాకు గుర్తు లేదు. కానీ మా నాన్న ఒక మాట చెప్పేవారు. 'ఈ నృత్యమే మనకు దైవం. 'ఈ నృత్యాన్ని మరువద్దు. తరతరాలుగా మోసుకొస్తున్నాం. దీన్ని కాపాడుకుంటేనే దేవుడు మనల్ని కాపాడుతాడు' అని చెప్పేవాడు. ఆ మాట నాలో నాటుకుపోయింది. నాకు వయసొచ్చినప్పటి నుంచి నృత్యంలో తొలి ఆటగాడిగా అడుగులు వేస్తుండేవాణ్ని. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు నివసించే రెండువేల గూడేలకూ నేను తెలిసిపోయాను.

గణతంత్ర వేడుక

గణతంత్ర వేడుకల్లో మా ప్రాచీన వారసత్వ కళ అయిన గుస్సాడి నృత్యాన్ని ప్రదర్శించే అవకాశం నాకు 1982లో వచ్చింది. అప్పుడు ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి మా గుస్సాడి టోపీ పెట్టించి, గజ్జెలు కట్టించాం. ఆమె మాతో అడుగులు వేసింది. ఆ తర్వాత ఓసారి అబ్దుల్ కలామ్ కూడా మాతో అడుగులు వేశారు. హైదరాబాద్‌లో ఎన్ని ప్రదర్శనలిచ్చామో లెక్కే లేదు. ఢిల్లీలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో కూడా మా గుస్సాడిని ప్రదర్శించాం. మరో పది దఫాలు యువతతో చేయించాం. నాయన మాట మీద గుస్సాడి కోసం బతికినందుకే మా దేవుడు మెచ్చి గొప్ప వాళ్ల కిచ్చే పద్మశ్రీని ఇప్పించాడనుకుంటున్నా.



2021లో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకుంటూ...



సంప్రదాయ వస్త్రధారణలో గుస్సాడి కనకరాజు

నెమలీకల టోపీ

మా నృత్యం సాధన చేయడమే కాదు, టోపీ, దుస్తులు, గజ్జెలు అన్నీ ప్రత్యేకమే. వాటిని తయారు చేయడానికి చాలా నైపుణ్యం ఉండాలి. పెద్ద టోపీకి రెండు వేల పింఛాలుంటాయి. మా ఇళ్లలో వాటిని భద్రపరుచుకోవడం పెద్ద పని. మా ముత్తాతలు ధరించిన టోపీ ఇంకా నేను ధరిస్తూనే ఉన్నాను. కొత్తవాళ్ల కోసం టోపీలు తయారు చేస్తున్నాం. పెద్ద టోపీ, దుస్తులతోపాటు మొత్తం వేషానికి ఇరవై వేల రూపాయలవుతాయి. మా ఆదివాసీ వ్యక్తి తుకారామ్ సాబ్ కలెక్టర్ అయిన తరవాత ఈ నృత్యానికి ఇంకా కొన్ని చేర్పులు చేసి బాగా మంచిగా చేశారు. పద్మశ్రీ వచ్చిన తర్వాత ఐటీడీఏ ఆఫీసర్‌లు గుస్సాడి నృత్యం నేర్పించడానికి వందకు పైగా బడులు పెట్టారు. ఒక్కో బడిలో రెండు-మూడు వందల మంది నేర్చుకుంటున్నారు. నేను పెద్ద మాస్టర్ (చీఫ్ డాన్స్ మాస్టర్)ని. గుస్సాడి, రేలా పాట నేర్పించడానికి 30 మందిని ప్రత్యేకంగా తయారు చేశాను. మరో రెండు వందల మందికి సంపూర్ణంగా శిక్షణనిచ్చాను. ఇంక మామూలుగా నేర్చుకుని ఆడే వాళ్లు ఎన్ని వేల మంది ఉన్నారో నేను ఎప్పుడూ లెక్క చెప్పుకోలేదు.

అడవి తల్లికి అందరూ ఒక్కటే!

మా ఆదివాసీల్లో మగపిల్లాడు ఎక్కువ, ఆడపిల్ల తక్కువనే ఆలోచనే ఉండదు. బిడ్డలంతా సమమే. పెళ్లిలో కట్నకానుకలు ఉండవు. ఆడబిడ్డ పుట్టిందని చింతపడడం మాకు తెలియదు. నాకు ఎనిమిది మంది కూతుళ్లు, ముగ్గురు కొడుకులు. బతకడానికి ఆశ్రమ పాఠశాలలో రోజు కూలీగా పని చేస్తూ కూడా అందరికీ చదువు చెప్పించాను. తొమ్మిది- పది తరగతుల వరకు అందరూ చదువుకున్నారు. రెండో కొడుకు వెంకటేశ్ మాత్రం డిగ్రీ చదివి టీచర్ ఉద్యోగం చేస్తున్నాడు. తరతరాలుగా అడవులకే పరిమితమైపోయిన గుస్సాడి నృత్యాన్ని నేను దేశానికి తెలియ చెప్పాను. మీరు మన ఆట, పాటలను ఇతర దేశాలకు తీసుకెళ్లాలని నా పిల్లలు, శిష్యులకు చెబుతున్నాను" అని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు గుస్సాడి కనకరాజు.

– వాకా మంజులారెడ్డి

సందర్భం

స్కూల్ రోజుల్లో నియతికి లెక్కలు అంటే లెక్కలేనంత భయం.
ఇప్పుడు ఆమెకు వ్యాపార లెక్కలు కొట్టిన పిండి.
అప్పట్లో సైన్స్ సబ్జెక్ట్ పేరు వినబడగానే ముఖం తిప్పుకునేది చిన్నారి నియతి.
ఇప్పుడు ఆమెకు వంటల శాస్త్రం లోతుపాతులు బాగా తెలుసు.
చిన్న వయసులోనే 'స్టార్ చెఫ్'గా పేరు తెచ్చుకున్న
ముంబైకి చెందిన నియతిరావు 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఏషియా-2023'
జాబితాలో చోటు సంపాదించింది...

సాహోరే స్టార్ చెఫ్



నియతిరావు

చిన్నప్పుడు నియతిరావు బడి అంటే భయపడేది. లెక్కలు, సైన్స్ అంటే చాలు ఆమెకు వణుకు వచ్చేది. అలాంటి నియతికి అమ్మ, అమ్మమ్మలు చేసే వంటలు అంటే ఇష్టం. వాళ్లు వంటలు చేస్తుంటే ఆసక్తిగా గమనించేది.

తల్లి గుజరాతీ. తండ్రి దక్షిణ భారతం. దీంతో అటు వంటకాలు ఇటు, ఇటు వంటకాలు అటూ వెళ్లేవి. వంటలను అమితంగా ప్రేమించే ఆ ఇంట్లో ఉత్తరాది, దక్షిణాది అనే తేడా లేకుండా ఎన్నో వంటకాలు చవులూరించేవి. 'తినరా మైమరిచి' అని ఆప్యాయంగా పిలుస్తుండేవి.

'అదృష్టాన్ని నమ్ముకోకుండా ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకోండి, అద్భుత ఫలితాన్ని సొంతం చేసుకోండి' అనే మాటను ఎన్నోసార్లు విన్న నియతి తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని చెఫ్‌గా మారింది.

కోపెన్‌హెగన్(డెన్మార్క్)లో వరల్డ్ ఫేమస్ రెస్టారెంట్ నోమాలో ఇంటర్న్‌షిప్ తరువాత తిరిగి ముంబైకి వచ్చింది.

'ఇప్పుడు ఏ వ్యాపారమైనా రిస్క్' అనుకునే సమయం అది.

నేను తెలుసుకున్న సత్యం



వంటకం అంటే ఆకలి తీర్చుకోవడం. రుచులను ఆస్వాదించడానికే పరిమితమైనది కాదు. అది మన సంస్కృతి. మనం పరస్పరం ఇచ్చుకునే గౌరవం. తరం నుంచి తరానికి మధ్య కదిలే జ్ఞాపకం. గత దశాబ్ద కాలంలో నేను నేర్చుకున్న ఏకైక విషయం... మన భారతీయ వంటకాలు ఎంతో గొప్పవి అని. వాటికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉంది అని. మన వంటకాలలో ఉపయోగించే దినుసులపై ప్రత్యేకంగా దృష్టి పెడితే ఎన్నో కాంబినేషన్‌లు, టెక్నిక్స్ గురించి తెలుసుకోవచ్చు, కొత్త రుచులను ఆస్వాదించవచ్చు.

– నియతిరావు

అలాంటి సమయంలో 'ఎక్కా' రెస్టారెంట్ ప్రారంభించడానికి రెడీ అయింది. ప్రాజెక్ట్ పట్టాలెక్కుతున్న సమయంలో ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేశారు.

'కొన్ని సమయాల్లో డబ్బు కంటే మన మీద మనకు నమ్మకం చాలా అవసరం' అంటున్న నియతి ఆరోజు ధైర్యాన్ని కోల్పోయి ఉంటే, 'ఇక చేసేదేమీ లేదు' అనే నిర్లిప్తతకు గురై ఉంటే 'స్టార్ చెఫ్'గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేది కాదు.

కొత్త ఇన్వెస్టర్‌లను ఒప్పించడానికి ఎంత కష్టపడిందో తెలియదుగానీ మొత్తానికైతే 'ఎక్కా' రెస్టారెంట్ కలను సాకారం చేసుకుంది.

పద్నాలుగు నెలల వ్యవధిలోనే 'ఎక్కా' ఆసియాలోని అత్యుత్తమ రెస్టారెంట్‌ల జాబితాలో చోటు సంపాదించింది.

ఈ ఘన విజయానికి కారణం ఏమిటి?

'మెనూ చూడగానే నోరూరడం మాత్రమే కాదు, పాత జ్ఞాపకాలు మదిలో నిండి పోవాలి. ఆ రోజుల్లో మా అమ్మ ఈ వంటకాన్ని అలా చేసేది. ఎంత బాగుండేదో కదా!... ఇలాంటి జ్ఞాపకాలెన్నో దృశ్యాలై కళ్లముందు నిలవాలి' అంటున్న నియతి తన రెస్టారెంట్‌ను ఆషామాషీగా ప్రారంభించలేదు.

ఎంతో గ్రౌండ్ వర్క్ చేసింది.

ఎన్నోచోట్ల సర్వే చేసి కస్టమర్‌ల అభిప్రాయాలను, అభిరుచులను తెలుసుకుంది.

ఏ రెస్టారెంట్ ఎందుకు సక్సెస్ అయింది? ఎందుకు అట్టర్ ఫ్లాప్ అయింది? తెలుసుకోవడానికి కేస్‌స్టడీ చేసింది.

వాటన్నిటినీ ఒక దగ్గర జోడించి, దానికి రుచి జత చేసి పక్కా ప్లాన్‌తో 'ఎక్కా' మొదలుపెట్టింది.

'నేను నేర్చుకున్నాను' అనేవారు ఒక రకం.

'నేను నేర్చుకుంటూనే ఉంటాను' అనేవారు రెండో రకం.

నియతి రెండో రకం.

'భారతీయ వంటకాలలో ఉపయోగించే దినుసులు వేటికవే ప్రత్యేకమైనవి. వాటి ఘుమఘుమలు మరో లోకంలోకి తీసుకువెళతాయి' అంటున్న నియతి దినుసులతో కొత్త ప్రయోగాలు చేస్తూ, కొత్త రుచులను పరిచయం చేస్తుంటుంది.

'ఎక్కా' నిర్వహిస్తున్న బిల్డింగ్‌లోనే 'కేయంసీ' అనే కమ్యూనిటీ స్పేస్‌ను లాంచ్ చేసింది నియతి. 'కేయంసీ' అనేది సృజనాత్మక వంటల ఎగ్జిబిషన్. వాటి గురించి వివరంగా మాట్లాడుకునే చర్చా వేదిక.

'నియతి భవిష్యత్ దార్శనికురాలు. నిత్యప్రయోగశీలి. తన చురుకుదనంతో టీమ్ మెంబర్స్‌లో ఉత్సాహం నింపుతుంది. ప్రతిభ, నాయకత్వ సామర్థ్యం ఉన్న నియతి చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది' అంటున్నారు 'ఎక్కా' ఫస్ట్ ఇన్వెస్టర్ శిల్ప లక్ష్మీనారాయణ్.

'రెస్టారెంట్ అంటే రుచుల సమ్మేళనం మాత్రమే కాదు దానికి సామాజిక బాధ్యత కూడా ఉంది' అంటున్న 28 సంవత్సరాల నియతిరావు మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

కొత్త దారి

ఆ కట్టుబడికి తరించేను గుర్రపుడెక్క జన్మ!

25 కిలోల గుర్రపు డెక్క నుంచి ఒక ఫ్యూజన్ చీర తయారు చేయవచ్చు.


'గుర్రపు డెక్కతో సమస్యలు ఇన్నిన్ని కాదయా' అనే విషయం మనకు తెలియనిదేమీ కాదు. నీటివనరుల పాలిట శత్రువుగా పరిగణించే గుర్రపు డెక్క నుంచి అందమైన చీరలు తయారు చేస్తూ 'ఆహా' అనిపిస్తున్నాడు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ గౌరవ్ ఆనంద్...

జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు చెందిన గౌరవ్ ఆనంద్ టాటా స్టీల్‌లో పనిచేస్తున్న రోజుల్లో నదుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఆ సమయంలో నదులలో దట్టంగా పేరుకు పోయిన గుర్రపు డెక్క అతడి దృష్టిలో పడేది.

'దరిద్రపు మొక్కలు' అని దాన్ని గురించి ప్రజలు తిట్టుకోవడాన్ని ఎన్నోసార్లు విన్నాడు.

'క్లీన్ రివర్ గంగా' మిషన్‌లో పాల్గొన్న తరువాత ప్రతివారం ఎక్కడో ఒకచోట నదులు, కాలువలు, చెరువుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనే వాడు.

'నది లేదా చెరువులు, కాలువలను ఒకసారి గుర్తు తెచ్చుకుంటే నీళ్లు కాదు గుర్రపుడెక్క మాత్రమే కళ్ల ముందుకు వచ్చేది' అంటాడు గౌరవ్.





జలవనరుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో మరింత విస్తృతంగా పాల్గొనడానికి కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలి 'స్వచ్ఛత' అనే ఫౌండేషన్‌కు శ్రీకారం చుట్టాడు గౌరవ్. ఒకవైపు పర్యావరణ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొంటూనే మరోవైపు గుర్రపు డెక్కపై ప్రయోగాలు చేసేవాడు.

మొదట్లో...

గుర్రపు డెక్కను ఉపయోగించి ల్యాంప్ షేడ్స్, పేపర్లు, నోట్‌బుక్‌లు, మ్యాట్‌లు... మొదలైనవి తయారు చేసేవాడు. ఆ సమయంలో 'ఇంకా ఏం చేయలేమా?' అని మేధోమథనం చేస్తున్న క్రమంలో పుట్టిన ఆలోచనే... గుర్రపు డెక్క నుంచి చీర. ఇలాంటి చీర ప్రపంచంలోనే మొదటిది. అయితే 'గుర్రపు డెక్క నుంచి చీరె' అనేది అంత సులువైన పని కాదు. ఎంతో ఓపిక ఉండాలి.

కాండాలను వారం రోజులపాటు ఎండ బెట్టడం, హాట్ వాటర్ ట్రీట్‌మెంట్ ద్వారా గుజ్జు నుంచి క్రిములను తొలగించడం, ఆ తరువాత దారం తయారు చేయడం పెద్ద పనే. అయితే గౌరవ్ ఎక్కడా డీలా పడలేదు. రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడం అలవాటు చేసుకున్నాడు.

ఈ ఏడాది చివరి కల్లా 1000 చీరెలను తయారు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు గౌరవ్.

పనికిరాని గుర్రపు డెక్క నుంచి అందమైన చీరెలను తయారు చేయడం ఒక కోణం అయితే గుర్రపు డెక్కను సేకరించి అమ్ముకోవడం ద్వారా ఎంతోమంది మహిళలు ఉపాధి పొందడం అనేది మరో కోణం.

నలభై ఏడు సంవత్సరాల రమ్యకు భర్త చనిపోయాడు. ఆమె ఒక పొగాకు ఫ్యాక్టరీలో తక్కువ జీతానికి పనిచేసేది. ఆరోగ్యం దెబ్బ తినడంతో ఉద్యోగం మానేసింది. గుర్రపు డెక్క సేకరణ ద్వారా రమ్య ఉపాధి పొందుతోంది.

'రోజుకు రెండు నుంచి మూడు గంటలు కష్టపడితే చాలు' అంటుంది రమ్య.

ప్రస్తుతం జంషెడ్‌పూర్ (జార్ఖండ్), ఖరగ్‌పూర్ (పశ్చిమ బెంగాల్)లో ఆఫ్‌లైన్ స్టోర్‌లలో ఈ చీరెలను అమ్ముతున్నారు. మధ్య తరగతిని దృష్టిలో పెట్టుకొని ధరలు నిర్ణయించారు.

'చీరెల ద్వారా లాభాలు గడించాలనేది నా లక్ష్యం కాదు. చేనేత కార్మికుల ఆర్థిక స్థాయి మెరుగుపడాలనేది నా కోరిక' అంటున్నాడు గౌరవ్ ఆనంద్.

'చెరువుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పుడు అంతూపొంతూ లేని గుర్రపు డెక్కను చూసి బాగా కోపం వచ్చేది. తిట్టుకునేదాన్ని కూడా. ఇప్పుడు అది అపురూపంగా కనిపిస్తోంది. ఉపయోగించుకుంటే ఏదైనా ఉపయోగమే' అంటుంది పర్యావరణ కార్యకర్త నళిని.

ఇప్పుడు తన ఫేవరెట్ చీర... గుర్రపు డెక్క నుంచి తయారుచేసిన ఫ్యూజన్ చీర!

* న్యూ బిజినెస్

ఫేస్ యోగా విత్ ఆయిల్స్



బ్యూటీ ప్రొడక్ట్స్‌తో అరోరా

తనకు వచ్చిన కష్టాన్ని తలుచుకుంటూ కుంగిపోలేదు విభూతి అరోరా. నిరాశగా అనిపించే రోజులనే అవకాశాలుగా మార్చుకొని నేడు సౌందర్య ఉత్పత్తుల వ్యాపారంలో అగ్రగామిగా నిలిచింది. దానికి ముందు అనుభవించిన శారీరక, మానసిక బాధ దానిని ఎదుర్కొన్న పరిణామాలను వివరిస్తుంది ఈ గురుగ్రామ్ వాసి.

"నాకు పాతికేళ్ల వయసులో చర్మానికి సంబంధించిన 'లూపస్' అనే ఆటో ఇమ్యూన్ సమస్య వచ్చింది. ముఖం అంతా దద్దుర్లు వచ్చాయి. చర్మం పగిలి రక్తం కారుతుండేది. ఈ పరిస్థితి ఎంత భయంకరంగా ఉండేదంటే నా రూమ్ దాటి బయటకు వచ్చేదాన్నే కాదు. నా ముఖం ఎవరూ చూడకూడదని లోపలే ఉండిపోయేదాన్ని. రోజంతా ఏడుస్తూ నిద్రపోయేదాన్ని. ఎవరిలోనూ కలవకపోవడం వల్ల నా బంధుమిత్రులకు వ్యతిరేకిని కూడా అయ్యాను. కొన్ని రోజులకు ఒంటరితనంతో నాకు పిచ్చిపడుతుందేమో అనిపించేది.

పెళ్ళిని వదిలేసి..

ఇంతలో మా ఫ్రెండ్ పెళ్లికి రమ్మని ఆహ్వాన పత్రిక వచ్చింది. చాలా సంతోషం అనిపించింది నా స్నేహితులందరినీ కలవచ్చని. ఒక రోజు ముందే ఆ పెళ్లికి వెళ్లాను. డాక్టర్ చెప్పిన మందులను ఆ రాత్రి వేసుకున్నాను. మొత్తం రియాక్షన్ వచ్చింది. ముఖంతో పాటు శరీరం అంతా దద్దుర్లు. దీంతో పెళ్లిలో ఎవరినీ కలవకుండానే ఇంటికి తిరిగివచ్చేశాను. మళ్లీ డాక్టర్ని కలిశాను కానీ, ఎలాంటి ప్రయోజనం లేకపోయింది.

అమ్మమ్మ చిట్కాతో...

ఏం తింటున్నాను, ఏం షాంపూ, ఫేస్ వాష్ ఏది వాడుతున్నాను అనేవి మళ్లీ మళ్లీ చెక్ చేసుకున్నాను. ఎందువల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందో నాకు అర్థం కాలేదు. చాలామంది వైద్యులను సంప్రదించాను. కానీ, నా సమస్య పరిష్కారం కావడం లేదు. ఒకరోజు మా అమ్మమ్మ సూచించిన ఇంటి చిట్కాను ఉపయోగించడం మొదలుపెట్టాను. దేశీ నెయ్యితో ముఖానికి మసాజ్ చేయడం ప్రారంభించాను. దాంతోపాటు కొద్దిగా ఫేస్ యోగా చేయడం మొదలుపెట్టాను. మెల్ల మెల్లగా ఆ ప్రభావం నాకు తెలిసి వచ్చింది. దాదాపు పదేళ్లుగా పోరాడుతున్న సమస్యకు ఉపశమనం లభించింది.

కొత్త ఉత్పత్తి

దేశీ ఆవు నెయ్యి నాకు అమోఘంగా పని చేసింది. దీంతోపాటు ఫేస్ యోగాతో నా చర్మ సమస్యకు పరిష్కారం లభించింది. అంతే, ఇక నా ప్రయోగాలు మొదలయ్యాయి. ఆయుర్వేద నూనెలు, ఫేస్ యోగాతో అనుసంధానిస్తూ ఒక కొత్త ఉత్పత్తిని తయారు చేయడం మొదలుపెట్టాను. అలా, నాలుగేళ్ల క్రితం 'హౌస్ ఆఫ్ బ్యూటీ' మొదలైంది.

సెల్ఫ్ డిజైన్ ఫేస్ యోగా

రుగ్వేదంలో ముఖానికి 8 యోగాసనాలు ఉన్నాయి. నాకు అనారోగ్యం వచ్చినప్పుడు దాదాపు 80 ముఖ యోగా భంగిమలు చేశాను. దీంతో తేలికపాటి మచ్చలు కూడా తగ్గిపోయాయి. దాని ప్రభావం నా ముఖంపై కనిపించినప్పుడు మా కుటుంబ సభ్యులు, స్నేహితులు అడగడం మొదలుపెట్టారు. ఆ తర్వాత మాకు కూడా ఫేస్ యోగాను నేర్పించండి అని తెలిసినవారు అడుగుతుండేవారు. దీంతో ముఖం కోసం 80 యోగాసనాలతో కూడిన కోర్సును డిజైన్ చేసి, ఉత్పత్తులతో సహా మార్కెట్‌లోకి విడుదల చేశాను. మొదట జనం దీనిని సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, వాడి, ఆ ఫలితాన్ని అనుభవించిన వాళ్లు నా క్లాస్‌కి రావడం, వాళ్ల ద్వారా మరికొంతమంది చేరడం మొదలుపెట్టారు. మెల్ల మెల్లగా ఫేస్‌యోగా ప్రజాదరణ పొందింది.





సౌందర్య ఉత్పత్తులు

దేశీనెయ్యి, బాదం నూనెతో మసాజ్ ఆయిల్స్ తయారు చేశాను. రసాయనాలు లేని, అన్ని రకాల చర్మ తత్త్వాలకు సరిపోయే వివిధ సౌందర్య ఉత్పత్తులను తయారు చేశాను. ఏ రసాయనాలు లేని ఉత్పత్తులు వాడటం వల్ల ఎలాంటి చర్మ సమస్యలూ తలెత్తవు. అయితే, అది అంత తేలికైన పనికాదని కొన్ని రోజులకే అర్థమైంది. ఇప్పటికే ఎన్నో బ్యూటీప్రొడక్ట్స్ మార్కెట్‌ని ఏలుతున్నాయి. నా సొంత ఆలోచనతో పనిచేయడానికి చాలా ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. రసాయన రహిత ఉత్పత్తుల షెల్ఫ్ కాలం రెండేళ్లు మాత్రమే ఉంటుంది. కాబట్టి, అమ్మడం కష్టంగా ఉండేది. బ్యూటీప్రొడక్ట్స్ మార్కెట్ చేసే వాళ్లు నా ప్రొడక్ట్స్‌ని తీసుకోవడానికి ఇష్టపడలేదు. దీంతో నా వ్యాపారానికి చాలా ప్రతిబంధకాలు ఉన్నాయని అని అర్థమైంది.

ఫేస్‌యోగా విత్ బ్యూటీ ప్రొడక్ట్

కానీ, నేడు అలియాభట్, మలైకా అరోరా వంటి సెలబ్రిటీలు నా ఉత్పత్తులు కొనుగోలు చేయడం, వాళ్లు నా ఫేస్ మసాజ్ టూల్‌తో మా ప్రొడక్ట్స్‌కు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో చాలా విజయం సాధించాను అనిపించింది. ఇది నాకు ఉచితంగా లభించిన ప్రమోషన్. దీంతో నా ఉత్పత్తులకు మరింత ప్రజాదరణ లభించింది. నాలుగేళ్లలోనే నా ప్రొడక్ట్స్ సెలబ్రిటీలు ఉపయోగించే దశకు చేరుకుంది. దీంతో నాకు చాలా సంతోషంగా ఉంది. ప్రతికూల పరిస్థితుల నుంచి బయటపడి నాకు నేనుగా నిలదొక్కుకోవడానికి చేసిన కృషిలో మా కుటుంబ విజయం కూడా దాగుంది' అని వివరిస్తుంది అరోరా.